## రెండు కుటుంబాల్లో నలుగురికి కొలువులు

### ఒక కుటుంబంలో అన్నదమ్ములు, మరో కుటుంబంలో వదినా, మరిది

దమ్మపేట, అక్టోబర్ 5: మండలంలో మారుమూల గిరిజన గ్రామమైన గణేశ్‌పాడులో రెండు కుటుంబాల్లో నలుగురు ఉపాధ్యాయ కొలువులకు ఎంపికయ్యారు. వారిలో ఒక కుటుంబం నుంచి ఇద్దరు అన్నదమ్ములు, మరో కుటుంబం నుంచి వదిన, మరిది ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గణేశ్‌పాడు గ్రామానికి చెందిన నూతలకంటి వెంకన్నబాబు, నూతలకంటి శ్రీనివాసరావులు స్వయానా అన్నదమ్ములు. మద్దిరాల నాగపుష్ప, మద్దిరాల మహేశ్వరరావు వదిన, మరిది. వీరంతా ఈ ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ పరీక్ష రాశారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే డీఎస్సీకి క్వాలిఫై అయ్యారు.

## ఎఫ్‌పీవోల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న అశ్వారావుపేట పామాయిల్ రైతులు

అశ్వారావుపేట, అక్టోబర్ 5: ఆయిల్ పాం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎఫ్‌పీవోల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆంధ్రా ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌ను ఏలూరు జిల్లా పెద్దవేగిలో అశ్వారావుపేట జోన్ ఆయిల్ పాం గ్రోవర్స్ సొసైటీ బాధ్యులు ఉమామహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య వినతిపత్రం అందజేశారు. పెద్దవేగిలోని ఆయిల్ ఫామ్ పరిశోధనా కేంద్రంలో ఎంపీని కలిసిన గ్రోవర్స్ సొసైటీ బాధ్యులు మాట్లాడుతూ తగ్గిన పామాయిల్ ధరలు, దిగుబడులు తగ్గటంతో ఇబ్బందులు పడుతున్న పామాయిల్ రైతులను ఆదుకోవటంలో పార్లమెంటులో సమస్యను లేవనెత్తి తనవంతు కృషినందించినందుకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవోలు ఆల నాగేశ్వరావు, తుమ్మ రాంబాబు ఉన్నారు.

## పండుగ పూట పస్తులేనా..?

### -9 నెలలుగా జీతాలు లేక అవస్థలు

అశ్వాపురం, అక్టోబర్ 5: మండల పరిధిలోని 24 పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు 9 నెలలుగా ప్రభుత్వం సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో పండుగ పూట కూడా తమ కుటుంబాలు పస్తులు ఉండాల్సిందేనా అంటూ పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు పెండింగ్ వేతనాలు పండుగలోపు చెల్లించాలని కోరుతూ శనివారం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే పాయం కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో మోకాలి శస్త్ర చికిత్స

పాల్వంచ, అక్టోబర్ 5: స్థానిక ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో మోకాలి శస్త్ర చికిత్సను ప్రభుత్వ ఆర్థోపెడిక్ డాక్టర్ శైలేష్‌కుమార్ శనివారం విజయవంతంగా నిర్వహించారు. పాల్వంచ గట్టాయిగూడేనికి చెందిన అనసూర్య(60) కుడి కాలి మోకాలి నొప్పితో ఈ ఆస్పత్రికి వచ్చారు. మోకాలి వద్ద గడ్డ మాదిరిగా వాపు ఉంది. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో నెల క్రితం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. ఆమెను డాక్టర్ శైలేష్‌కుమార్ పరీక్షించి, ఆపరేషన్ అవసరమని నిర్ధారణకు వచ్చారు. శనివారం ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఆయనను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ సోమరాజు దొర, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు అభినందించారు.

## టిప్పర్ డ్రైవర్, క్లీనర్ల వేతనాలు పెంచాలి

టేకులపల్లి, అక్టోబర్ 5: ఎనిమిది సంవత్సరాలుగా కేఓసీలో బొగ్గు రవాణా డ్రైవర్, క్లీనర్లకు వేతనాలు పెంచనందుకు నిరసనగా తెలంగాణ ప్రోగ్రెస్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ టేకులపల్లి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం టేకులపల్లి లారీ ఆఫీస్ ఎదుట డ్రైవర్లు, క్లీనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రెస్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న మాట్లాడుతూ 2017లో డ్రైవర్ల, క్లీనర్ల వేతనాలు పెంచారని నాటి నుంచి నేటి వరకు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వేతనాలు పెంచనట్లయితే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ కమిటీ కార్యదర్శి గుగులోత్ మదార్, ఐఎఫ్‌టీయూ టేకులపల్లి కమిటీ కార్యదర్శి సుందర్, రవీందర్, గణేశ్, వినోద్, సాయి, కృష్ణ, ప్రసాద్, బాలకృష్ణ, శ్రీను, అనిల్, రమేశ్ పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

అశ్వాపురం, అక్టోబర్ 5: యశ్నచౌదరి బారసాల సందర్భంగా వారి కుటుంబసభ్యులు ఆరీఫా, రోష్ని వృద్ధాశ్రమానికి శనివారం రెండున్నర క్వింటాళ్ల బియ్యం, పండ్లు వితరణగా అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సింగరేణి సేవాసమితి సభ్యులు నాజర్‌పాషా, విశ్రాంత ఉద్యోగి ఎండి.అహ్మద్, సామాజిక కార్యకర్త పాల్గొన్నారు.

# అన్నపూర్ణ దేవి అలంకరణలో అమ్మవారు

అన్నపురెడ్డిపల్లి: పూజలు చేస్తున్న భక్తులు

అశ్వారావుపేట టౌన్: చిన్నంశెట్టి బజార్‌లో..

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దమ్మపేట రూరల్, అక్టోబర్ 5: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం అన్నపూర్ణ దేవి అలంకరణలో గాయత్రి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు మూర్తీజీ హోమం నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు.

**గజలక్ష్మి అలంకారంలో..**

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 5: స్థానిక శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మీ అవతారంలో, శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో మంగళగౌరి దేవిగా అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**అశ్వారావుపేట టౌన్..**

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 5: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు కాశీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, అలంకరణ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అశ్వారావుపేట: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**దమ్మపేట..**

దమ్మపేట, అక్టోబర్ 5: అన్నపూర్ణదేవీగా అమ్మవారు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. శివశక్తి యూత్ ఆధ్వర్యంలో దమ్మపేటలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున్‌రావు దంపతులు, భక్తులు, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**పాల్వంచ రూరల్..**

పాల్వంచ రూరల్, అక్టోబర్ 5: మండలంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో శనివారం హనుమాన్ విగ్రహానికి అర్చకులు ఆకు పూజ చేశారు. శ్రీకనకదుర్గ అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని జాయింట్ కలెక్టర్ డి.వేణుగోపాల్ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. త్వరలో ప్రారంభమయ్యే అన్నదాన కార్యక్రమానికి రాజమండ్రి స్వరూప్ నగర్‌కు చెందిన భక్తులు యడ్ల విజయరామారావు దంపతులు రూ.1,01,116ను విరాళంగా అందించారు.

భద్రాచలం: కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

పర్ణశాల: పూజలు చేస్తున్న భక్తులు

దుమ్ముగూడెంలో..

పాల్వంచ రూరల్‌లో..

## క్రీడల ద్వారానే క్రమశిక్షణ

### సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 5: క్రీడలు ఆడటం ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. శనివారం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీజనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. ఉద్యోగులు ప్రతీ రోజు 30 నిమిషాలు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. యువ ఉద్యోగులు క్రీడల పై మక్కువ చూపి క్రీడల్లో ప్రతిభను చాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారులు సాయి స్వరూప్, రమేష్‌సింగ్, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, అక్టోబర్ 5: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణ తులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారికి బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## వాహనం బోల్తా

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 5 ః వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గుండాలమండలం సాయనపల్లి గ్రామానికి చెందిన ఇర్ప కృష్ణ తన బొలెరో వాహనంలో 15 క్వింటాళ్ళ వడ్లు తీసుకొని ఇల్లెందుకు విక్రయించేందుకు వస్తున్నాడు. మండలంలోని కొమరారం, మామిడిగూడెం మార్గ మధ్యలో వాహనం అదుపుతప్పి బొల్తాపడింది. వాహనంలో ప్రయాణిస్తున్న ఎనిమిది వ్యక్తులకు తీవ్రగాయాలు కాగా స్థానికులు గమనించి ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందులో ఆరుగురికి స్వల్ప గాయాలతో బయటపడగా మిగతా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం మమత ఆసుపత్రికి తరలించారు.

## ఇద్దరు జడ్జీలకు పదోన్నతి

జడ్జి భానుమతి

జడ్జి బత్తుల రామారావు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 5: కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గొల్లపూడి భానుమతి.. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కొత్తగూడెం సెక్రటరీగా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు.. కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. వీరిద్దరూ జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తదితరులు అభినందించారు.

## విద్యుత్ సంఘం కమిటీ ఎన్నిక

పాల్వంచ, అక్టోబర్ 5: విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104 యూనియన్) కేటీపీఎస్ 5,6,7 దశల విస్తృత స్థాయి సమావేశం శనివారం కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో జరిగింది. 5,6 దశల రీజినల్ కమిటీని ఎన్నుకుంది. ప్రెసిడెంట్‌గా కేశబోయిన కోటేశ్వరరావు, సెక్రటరీగా మడిపల్లి గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాలోత్ బిచ్చ, అడిషనల్ సెక్రటరీగా గుగులోత్ గణపతి ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఊరికెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి: డీఎస్పీ

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 5: దసరా పండుగకు ఎవరైనా ఊరికెళ్తే పోలీసులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. పోలీసులకు సమాచారం ఇస్తే రాత్రి పూట ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. దీని వల్ల ఎటువంటి దొంగతనాలు జరిగేందుకు ఆస్కారం ఉండదన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసులకు సమాచారం ఇవ్వాలనుకుంటే 8712682069, 8712682070 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

## మొక్క నాటిన చిన్నారి

చుంచుపల్లి, అక్టోబర్ 5: పర్యావరణ పరిరక్షకుడు చిన్నారి మూడ్ విశ్వామిత్ర చౌహాన్‌తో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శనివారం జిల్లా కోర్టు ఆవరణలో అవకాడ, తైవాన్ మామిడి మొక్కలు నాటారు. ఆ చిన్నారిని అభినందించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గొల్లపూడి భానుమతి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్: పాతరామాలయం వద్ద చిన్నారుల బతుకమ్మ కోలాటం

## బతుకమ్మ సంబురాలు

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. బతుకమ్మ పండుగను వాడవాడలా జరుపుకుంటున్నారు. చిన్నారులు, మహిళలు ఉత్సవ మండపాల వద్దకు రంగు రంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలను నెత్తిన పెట్టుకుని ప్రదర్శనగా తీసుకువచ్చారు. తెలంగాణ సాంప్రదాయ బతుమ్మ గేయాలతో నృత్యాలు చేస్తూ అలరించారు. అనంతరం బతుకమ్మలను సమీప చెరువులవద్ద బతుకమ్మ ఘాట్‌లలో నిమజ్జనం చేశారు.

- నమస్తే నెట్‌వర్క్

పాల్వంచ: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పాల్వంచ: బతుకమ్మ సంబురాల్లో విద్యార్థినులు, అధ్యాపకులు, సారపాక : బతుకమ్మ ఆడుతున్న మహిళలు, అశ్వారావుపేట: షిర్డీసాయి బాబా ఆలయంలో

## అభివృద్ధికి సహకరించండి ..

చండ్రుగొండ, అక్టోబర్ 5: పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తానని, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపు నిచ్చారు. శనివారం మండలంలోని మద్దుకూరు, మహ్మద్‌నగర్, అన్నారం తండా గ్రామాల్లో రూ.2.20కోట్లతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. తిప్పనపల్లి పంచాయతీ మహ్మద్‌నగర్ గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్‌శాఖ డీఈ సైదుల్‌రెడ్డి, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో అశోక్, ఏఈ శ్రీనివాసరావు, ఎంపీవో ఖాన్, నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మాలోత్ బోజ్యనాయక్, నల్ల మోతు రమణ, గుగులోత్ బాబు, ధరావత్ రామారావు, లంకా విజయలక్ష్మి, ధరావత్ పార్వతి, పాల్గొన్నారు.

## నేడు కేఓసీ-2 నిర్వాసితుల విజయోత్సవ సభ

టేకులపల్లి, అక్టోబర్ 5: కోయగూడెం ఓసీ-2 నిర్వాసితులకు న్యాయం చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని హర్షిస్తూ ఆదివారం టేకులపల్లిలో విజయోత్సవ ర్యాలీ, సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ భూనిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం టేకులపల్లి కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీ వెంకట్, అతిథులుగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య పాల్గొంటారని తెలిపారు.

## దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలి

దుమ్ముగూడెం, అక్టోబర్ 5: రైతులు పండించిన దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సీతారామయ్యభవన్‌లో జరిగిన ములకపాడు శాఖా మహాసభలో ఆయన మాట్లాడారు.

## వెంకటస్వామి సేవలు మరువలేనివి

ఇల్లెందు రూరల్: మాట్లాడుతున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 5: గడ్డం వెంకటస్వామి సేవలు మరువలేనివని జీఎం జాన్ ఆనంద్ కొనియాడారు. శనివారం జీఎం కార్యాలయంలో వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటస్వామి 1961 నుంచి 1964 వరకు ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు నాయకత్వం వహించారన్నారు. 75 వేల గుడిసె వాసులకు వసతి కల్పించారన్నారు. కేంద్రమంత్రిగా, జౌళి, కార్మిక, పునరావాస శాఖ మంత్రిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారులు గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, కృష్ణమోహన్, దిలీప్‌కుమార్, ధనుంజయ్‌రెడ్డి, మహేష్, అంజిరెడ్డి, నాయకులు నజీర్ , వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం సింగరేణి..**

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 5: కొత్తగూడెంలోగల సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాల్ వద్ద వెంకటస్వామి జయంతి వేడుకను అధికారులు నిర్వహించారు. చిత్రపటానికి జీఎం (ఓసీపీ) డీవీఎస్ సూర్యనారాయణ రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. జీఎంలు మనోహర్, వీసం కృష్ణయ్య, డీజీఎం రాజేంద్ర ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, డీవైపీఎంలు సుశీల్‌కుమార్, శివకుమార్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

**వెంకటస్వామికి నివాళి**

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 5: స్వాతంత్ర్య సమర యోధుడు, కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతిని ప్రభుత్వం శనివారం అధికారికంగా నిర్వహించింది. ఐడీవోసీ సమావేశ మందిరంలో వెంకటస్వామి చిత్రపటానికి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పూలమాల వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్ ఏవో రమాదేవి, ఎల్‌డీఎం వెంకటరామిరెడ్డి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, డీఎంహెచ్‌ఓ త్రినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా: తాటి

చండ్రుగొండ, అక్టోబర్ 5: కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని దామరచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సంగొండి రాఘవులు తండ్రి అప్పయ్య దశదిన కర్మల్లో ఆయన పాల్గొని అప్పయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో మాజీ జడ్పీటీసీ జడ వెంకయ్య, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నం రామకృష్ణ, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సత్తి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## సహోద్యోగి కుటుంబానికి కానిస్టేబుళ్ల సాయం

చెక్ అందజేస్తున్న ఎస్సీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 5: ఇటీవల 2000 సంవత్సరం బ్యాచ్ కానిస్టేబుల్ రమణారెడ్డి మృతిచెందారు. ఆయన బ్యాచ్‌మేట్స్ అయిన 15 మంది కానిస్టేబుళ్లు రూ.2లక్షలను ఎస్సీ బిరుదరాజు రోహిత్ రాజు ద్వారా శనివారం ఆ కుటుంబానికి అందించారు. వీరిని ఎస్సీ అభినందించారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

టేకులపల్లి, అక్టోబర్ 5: ఇంటి ఆవరణలో నడుస్తూ కాలుజారి కిందపడి తలకు గాయంకావడంతో ఆస్పత్రితో చికిత్స పొందుతు మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని దాస్‌తండాలో చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్సై పీ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దాస్‌తండాకు చెందిన బానోత్ బుజ్జి (42) గత నెల 20వ తేదీ సాయంత్రం తన ఇంటి ఆవరణంలో నడుస్తుండగా కాలుజారి కిందపడి తలకు గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. మెరుగై న చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి అక్క ఇస్లావత్ సోనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త బానోత్ చిన్న, కుమారుడు ఉన్నారు.

## పశువుల అక్రమ రవాణా చేస్తున్న నలుగురిపై కేసు

టేకులపల్లి, అక్టోబర్ 5: బొలోరోలో ఎనిమిది పశువులను బంధించి అక్రమంగా తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదైన ఘటన టేకులపల్లిలో చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్సై పోగుల సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం టేకులపల్లిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా బొలేరోలో ఆవులను అక్రమంగా తరలిస్తున్న బేతంపూడికి చెందిన శ్యామ్, నరేశ్, పాల్వంచకు చెందిన ఖానీం, ఇల్లెందుకు చెందిన మోబిన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, ఆవులను పాల్వంచ గోశాలకు పంపినట్లు ఎస్సై తెలిపారు.

## అటవీ అధికారులపై కలప స్మగ్లర్ల దౌర్జన్యం

అశ్వాపురం, అక్టోబర్ 5: మణుగూరు నుంచి పాల్వంచకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి అటవీ అధికారులు అశ్వాపురం సెంటర్ వద్ద పట్టుకున్నారు. కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను నిలిపి పర్మిషన్ చూపించాలని అడగ్గా అటవీ అధికారులను దూషించి ట్రాక్టర్‌ను వదిలి పరారయ్యారు. దీంతో అటవీశాఖ అధికారులు కలప ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని అశ్వాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా రేంజర్ సిద్దబోయిన రమేష్ మాట్లాడుతూ.. అక్రమంగా కలప రవాణా చేస్తున్న వ్యక్తులు అనుమతులు లేకుండా దూషించారని, కలప విలువ రూ.20వేలు ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో అశ్వాపురం బీట్ ఆఫీసర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All

WANTED PLOTS
★ హైదరాబాద్, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, పసుమాముల, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, గ్రీన్‌సిటీ, మౌంట్ ఒపేరా, సింగరేణికాలనీలో ప్లాట్లు కొనబడును. No Broakers. 9553973999 / 6303049720.

PLOT FOR SALE
★ గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

WANTED
★ ఖమ్మం నగరంలోని ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు, స్త్రీ/పు, విశ్రాంత ఉద్యోగులు కావలెను. ఇంటి వద్ద ఉంటూ సంపాదించుకునే సువర్ణావకాశం. 9700603643, 7730068211.
NT-338905

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌